క్లుప్తంగా

సచివాలయ సిబ్బంది పనితీరు మార్చుకోవాలి



మాట్లాడుతున్న సీఈవో రవికుమార్

విజయపురం : సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించాలని సీఈవో రవి కుమార్ పేర్కొన్నారు. మంగళవారం విజయ పురం మండల కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో విజయపురం మండల సచివాలయ సిబ్బంది పని తీరు దారుణంగా ఉందని, వెంటనే పని తీరు మార్చుకోవాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రెండు రోజులకు ఓ సారి పాఠశాలలో మధ్యాహ్నం భోజనం, మరుగుదొడ్ల పరిశుభ్రతను పరిశీలించాలన్నారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు రాకుండా చూసుకోవాలని డీపీవో కాంచన సూచించారు.

వ్యాక్సినేషన్ పూర్తి చేయండి



రోగులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ హనుమంతరావు

గంగాధర్ నెల్లూరు : వ్యాక్సిన్ వేయడంలో పెండింగ్ ఉంటే వెంటనే పూర్తి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్వో హనుమంతరావు పేర్కొన్నారు. గంగాధర నెల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించి వ్యాక్సినేషన్ కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ దుర్గాదేవి, సీహెచ్ఓ శ్రీనివాసులు, హెల్త్ సూపర్ వైజర్ ధర్మేంద్ర, శైల , ఎంఎల్ హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

1008 మంది మహిళలతో కుంకుమార్చన



కుంకుమార్చనలో మహిళలు

నగరి : మున్సిపల్ పరిధి కొత్తపేటలోని నాగ దేవత ఆలయంలో నాగులచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని కుంకుమార్చన పూజలు నిర్వహించారు. 1008 మహిళలు ఈ పూజల్లో పాల్గొనడం ప్రత్యేకతను సంతరించుకుంది. మంత్రోచ్చారణల నడుమ మహిళలు కుంకుమార్చన పూజలు చేశారు. సాయంత్రం శివభక్తులతో తిరువాసగం పారాయణం చేపట్టారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



సర్పంచ్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

పుత్తూరు: ఎగవ గూళూరు దళితవాడకు సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం తడుకు సర్పంచ్ వెంకటేష్‌కు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గూళూరు కరుణ గ్రామస్తులతో కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామాన్ని పార్టీలకతీతంగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై స్పందించిన సర్పంచ్ మాట్లాడుతూ..గ్రామంలోని ప్రతి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి సరేష్, మస్తులు శివయ్య, కళ్యాణ్, సుమన్, దాము, పుష్పరాజ్, జైకుమార్, హేమంత్, ప్రదీప్, రాజశేఖర్, శశి కుమార్, సుధాకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ: తల్లీకుమారుడికి గాయాలు

శ్రీరంగరాజపురం : గుర్తు తెలియని వాహనం ఢీకొని తల్లీకుమారుడికి తీవ్ర గాయాలైన సంఘటన ఎస్ఆర్‌పురం మండలం నెలవాయి ఎస్ఎన్‌జే షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో చోటు చేసుకొంది. పోలీసుల కథనం మేరకు సోమవారం తెల్లవారుజామున తమిళనాడు రాష్ట్రం తిరువల్లూరు జిల్లా పళ్లిపట్టు తాలూకా కొత్త కుప్పం గ్రామానికి చెందిన తల్లి విమల, కుమారుడు హరీష్ ఇద్దరూ ద్విచక్ర వాహనంపై ఎస్ఆర్ పురం మండలంలోని యుఎం పురం గ్రామంలో ఉన్న బంధువుల ఇంటికి వస్తుండగా నెలవాయి ఎస్ఎన్‌జే షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చిత్తూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో వేలూరు సీఎంసికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుమన్ తెలిపారు.

యథేచ్ఛగా గుట్కా రవాణా

గుట్కా విక్రయాలు, వినియోగంపై ప్రభుత్వ నిషేధం ఉన్నా చాక్లెట్ కన్నా ఈజీగా నియోజకవర్గంలో లభ్యమవుతున్నాయి. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో వీటి విక్రయాలు జోరందుకుని ఊరూ.. వాడ అందుబాటులోకి వచ్చాయి. చాలా దుకాణాల్లో గుట్టుగా విక్రయాలు సాగుతున్నాయి. అధికారులు మొక్కుబడిగా తనిఖీలు చేసి వదిలేయడంతో అమ్మకాలు ఏమాత్రం తగ్గడం లేదు.

- బెంగళూరు వయా పుత్తూరు, నగరి
- కొరవడిన అధికారుల నిఘా
- దుకాణాల్లో గుట్టుగా విక్రయాలు
- వ్యసనానికి బానిసవుతున్న యువత





విజయపురం : మినరల్ వాటర్ అన్నిచోట్ల దొరుకుతుందో లేదో గానీ... ప్రతి పల్లెలోనూ గుట్కా మాత్రం యథేచ్ఛగా లభ్యమవుతోంది. పట్టణ నుంచి మండల స్థాయి వరకు ప్రతి పల్లెలో గుట్కా విక్రయాలు గుట్టు చప్పుడు కాకుండా విక్రయాలు సాగుతున్నాయి. అధికారులు ఎంత హెచ్చరించినా వ్యాపారులు పట్టించుకోవడం లేదు.

దుకాణాలకు చేరుతోంది ఇలా..

గుట్కా రవాణా పట్టణం నుంచి పల్లెకు చాపకింద నీరులా సాగుతోంది. బెంగళూరు నుంచి పుత్తూరు, నగరి పట్టణానికి వివిధ వాహనాల్లో రవాణా అవుతున్నాయి. అక్కడ నుంచి మినీ వ్యాన్లు , ద్విచక్ర వాహనాల్లో మారుమూల పల్లెల్లోని దుకాణాలకు చేరవేస్తున్నారని తెలిసింది. ఉదయం 6 నుంచి 9 గంటల మధ్య పుత్తూరు నుంచి నగరి పట్టణానికి చేరుతోందని, అక్కడ నుంచి ఓ వ్యక్తి రహస్యంగా హోల్‌సేల్ దుకాణాలకు చేరవేస్తున్నట్లు సమాచారం. మండల కేంద్రాల నుంచి వచ్చే చిరు వ్యాపారులు హోల్‌సేల్ దుకాణం నుంచి కొనుగోలు చేస్తున్నట్లు తెలిసింది.

ప్రాణహాని ఉన్నా...

గుట్కాతో కేన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధులకు గురవుతున్నా వ్యసనానికి అలవాటుపడి మానలేకపోతున్నారు. గుట్కాలో ఉండే మత్తు పదార్థాలు మనిషిని పూర్తిగా బానిసను చేస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వాటిని ఒక్కసారి వినియోగించినా మత్తుకు అలవాటు పడి వ్యసనంగా మారుతోందని చెబుతున్నారు. పేదవారు.. అందులోనూ కూలి పనులు చేసుకుని జీవించే వారు ఎక్కువగా వీటి ఉచ్చులో పడుతున్నారు. పక్కవారు తింటుంటే తాము రుచి చూద్దామని ఒక ప్యాకెట్ వేసుకుంటున్నారు. కొన్ని రోజులకు డోసు పెంచుతున్నారు. రోజుకు 20 ప్యాకెట్లు తీసుకునే వారు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. గుట్కాలో నాలుగు వేలకు పైగా రసాయనాలు ఉంటాయని, కేన్సర్‌ను తెప్పించే కారకాలు అధికంగా ఉంటాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా సాగుతున్న గుట్కా విక్రయాలపై స్థానిక ఓ పోలీసు అధికారి మాత్రం గుట్కాపై ఎలాంటి నిషేధం లేదని చెప్పడం గమనార్హం.

కాసులు కురిపిస్తున్న అమ్మకాలు

గుట్కా అమ్మకాలపై ప్రభుత్వ నిషేధం ఉన్నా నియోజకవర్గంలో వాటి విక్రయాలతో వ్యాపారులకు కాసులు కురిపిస్తున్నాయి. ప్రధానంగా యువతకు గుట్కా ఓ వ్యసనంగా మారింది. చదువుకుంటున్న వారు సైతం అధికంగా వినియోగిస్తున్నారు. చుట్టు పక్కల స్నేహితులతో సరదాగా గుట్కా అలవాటు చేసుకోవడంతో తరువాత వ్యసనంగా మారుతోంది. అలాగే దినసరి కూలీలు ట్రాక్టర్, ఆటో, లారీ డ్రైవర్లు కొందరు గుట్కా మోజులో పడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పుత్తూరు రూరల్, నగరి రూరల్, విజయపురం, నింద్ర, వడమాలపేట మండల పరిధిలోని రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన దుకాణాల్లో ఎనీ టైం గుట్కా దొరుకుతోంది.

వివాహ వేడుకలో మాజీ ఉప ముఖ్యమంత్రి



గంగాధరనెల్లూరు : నియోజకవర్గ పరిధిలోని పెనుమూరు ఎంపీపీ హేమలతారెడ్డి, వైఎస్సార్ సీపీ మాజీ కన్వీనర్ సురేష్ రెడ్డి దంపతుల కుమారుడు నూతన వరుడు దినేష్‌రెడ్డి వివాహ వేడుకల్లో మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి మంగళవారం పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

ఊరి మధ్యలో మడుగు.. నిగ్గదీసి అడుగు



నాలుగు నెలలుగా ఊరిలో నిలిచిన వర్షపు నీరు

విజయపురం (వడమాలపేట) : ఇటీవల కురిసిన వర్షాలకు బంగారెడ్డి కండ్రిగ ఎస్సీ కాలనీకి శాపంగా మారింది. వడమాలపేట మండలం బాలినాయుడు కండ్రిగ పంచాయతీ, బంగారెడ్డికండ్రిగ ఎస్సీ కాలనీ మధ్యలో నాలుగు నెలలుగా వర్షపు నీరు నిలిచి ఉంది. సుమారు మూడు అడుగుల లోతు వరకు నీరు నిలిచి ఉండటంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు నెలలుగా వర్షపు నీరు కదలకపోవడంతో పాచి పట్టి దోమలకు నిలయంగా మారింది. నాలుగు రోజుల కిందట ఓ మహిళ నిలిచి ఉన్న నీటిలో పడి గాయాలు పాలై రుయాలో చికిత్స పొందుతున్నారు. నాలుగు నెలలుగా వర్షపు నీటిలో కష్టాలు పడుతుంటే ఇంత వరకు ఒక్క అధికారి తమ గ్రామం వైపు కన్నెత్తి చూడలేదని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ

పాలసముద్రం : ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలు , ఏఎన్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ.. వర్షాకాలంలో వాతావరణంలో తేమ ఎక్కువగా ఉంటుందని, దీని వల్ల బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్‌లు, దోమలు వృద్ధి చెందడానికి అనువైన కాలమన్నారు. ఈ సీజన్‌లో వ్యాధి నిరోధక శక్తి కొంత బలహీన పడుతుందన్నారు. ఆశా కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి ప్రతి ఒక్కరూ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించాలన్నారు. జ్వరం, ఒళ్లు నొప్పులు, విరేచనాలు, చర్మ సమస్యల లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాలల్లో కూలర్లు, టైర్లు, కొబ్బరి చిప్పలు తదితర వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జ్ఞానశేఖర్, సూపరవైజర్ సుశీల, మురళి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రోన్‌తో పిచికారీపై అవగాహన

విజయపురం (వడమాలపేట) : ఆధునిక సాగు పద్ధతులు, డ్రోన్ ద్వారా పురుగుమందు పిచికారీ పై రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఉద్యానవన అధికారి దశరథరామిరెడ్డి పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం వడమాలపేట మండలంలోని శ్రీ బొమ్మరాజపురం గ్రామంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వయస్సు పైబడిన మామిడి చెట్లను తొలగించి ఆ స్థానంలో ఆయిల్ ఫామ్ తోటలను పెంచుకోవడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చన్నారు. పురుగు మందుల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి కేవీకే ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ తెలియజేశారు. విత్తన శుద్ధి ప్రాముఖ్యం గురించి ఏవో విజయకుమార్ రైతులకు వివరించారు. అనంతరం డ్రోన్ ద్వారా పురుగుమందు పిచికారీ విధానాన్ని ప్రదర్శన ద్వారా రైతులకు చూపించారు.



శ్రీ బొమ్మరాజపురంలో డ్రోన్ ద్వారా పురుగు మందుల పిచికారీపై ప్రదర్శన

బెల్టుషాపు నిర్వహిస్తే తాటతీస్తాం : సీఐ

- 30 మద్యం బాటిళ్లు స్వాధీనం, ఇద్దరి అరెస్టు



బెల్టుషాపు నిర్వహిస్తున్న వ్యక్తులను అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

కార్వేటినగరం : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తే తాట తీస్తామని సీఐ జవహర్‌బాబు హెచ్చరించారు. కార్వేటినగరం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని వెదురుకుప్పం మండల కేంద్రం, ఎగువ గెరిగదొన గ్రామాల్లో విస్తృతంగా దాడులు నిర్వహించి బెల్టు షాపు నిర్వహిస్తున్న మునిస్వామిరెడ్డి, పరమశివ వద్ద విక్రయానికి దాచి ఉంచిన 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ జవహర్‌బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి బెల్టుషాపులు నిర్వహించినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సారా అమ్మకాలు, తయారీ చట్టరీత్యా నేరమన్నారు. ఒకరిపై రెండు కేసులకు పైబడి నమోదు అయితే వారిపై పీడీ యాక్టు నమోదు చేయడం జరుగుతుందన్నారు. దాడుల్లో ఎస్ఐ పృథ్విరాజ్, హెడ్‌కానిస్టేబుల్ మునిసుందరం, క్రిష్ణయ్య, హేమాద్రి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

పాలసముద్రం : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ శ్యామల, ఎంపీడీఓ కృష్ణ మహేశ్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు. మండల స్థాయి అధికారులు ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసేందుకు జాబితా తీసుకురావాలని కోరారు.

వైభవంగా కోయిల్ ఆల్వార్ తిరుమంజనం

నగరి : పట్టణంలోని కరియ మాణిక్య స్వామి ఆలయంలో ఈనెల 14న పవిత్రోత్సవము సందర్భంగా మంగళవారం ×కోయిల ఆల్వార్ తిరుమంజనం₹ వైభవంగా నిర్వహించారు. స్థానిక ×ఓం శక్తి₹ ఆలయ సేవకుల సహకారంతో ఆలయానికి అల్యూమినియం నిచ్చెనను ఏఈవో రవికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 14, 15వ తేదీల్లో ఆలయంలో పవిత్ర ఉత్సవ కార్యక్రమం జరుగుతుందని అలాగే కార్తీక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రూ.300 చెల్లించి దంపతులు సంప్రదాయ దుస్తులతో ఈ ఉత్సవాలకు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ సోమశేఖర్, ఆలయ అధికారులు వెంకటరమణ, గుణశేఖర్, ప్రధాన అర్చకులు ధన్వంత ఆచార్యులు, నరసింహ ప్రసాద్ , వేద పారాయణ పండితులు రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.



కోయిల్ ఆల్వార్ తిరుమంజనంలో ఆలయ అధికారులు

ఎంపీడీవో పనితీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం



ఎంపీడీవోను ప్రశ్నిస్తున్న ఎంపీపీ



ఎంపీడీవోను నిలదీస్తున్న సర్పంచ్‌లు

- రసాభాసగా మండల సర్వసభ్య సమావేశం

నగరి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. సమావేశం ప్రారంభం నుంచి ఎంపీపీ, వైస్ ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఎంపీడీవో సతీష్ వైఖరిపై విరుచుకుపడ్డారు. ఎంపీపీ భార్గవి మాట్లాడుతూ.. మండల పరిషత్ ప్రథమ పౌరురాలైన తనకు మండల కార్యాలయంలో జరిగే ఏ సమాచారము అందడం లేదని మండిపడ్డారు. మండల సర్వసభ్య సమావేశాన్ని కూడా తాను ఫోన్‌చేసి కనుక్కోవాల్సిన పరిస్థితి ఎదురైందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము కూడా ప్రజలు ఎన్నుకుంటే వచ్చిన ప్రజా ప్రతినిధులమేనని మా అధికారాలు ఏమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఎంపీడీవో రెజల్యూషన్ ఇచ్చినా బిల్లులు ఎందుకు మంజూరు చేయలేదని నిలదీశారు. దీనిపై ఎంపీడీవో సమాధానమిస్తూ గత ఎంపీడీవో రెజల్యూషన్ ఇచ్చినందున కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి బిల్లులు చెల్లిస్తామన్నారు. దీనిపై సభ్యులందరూ ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సమావేశంలో చేసిన రెజల్యూషన్ ఈ సమావేశానికి కలెక్టర్ వద్దకు ఎందుకు తీసుకెళ్లాలో చెప్పాలంటూ ఎంపీడీవోను నిలదీశారు.

బిల్లులు చెల్లించాలంటే పచ్చనేతల సిఫారసు ?

ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మాట్లాడుతూ.. మండలంలో సర్పంచ్ చేసిన పనులకు బిల్లులు ఇవ్వాలంటే స్థానిక అధికార పార్టీ నేతలు సిఫారసు చేయాలని ఎంపీడీవో తమకు ఆదేశాలిచ్చారని కార్యదర్శులు చెబుతున్నారన్నారు. ఎంపీడీవో అధికార పార్టీ నేతగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మినీ గోకులం షెడ్లకు లబ్ధిదారులను ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారో చెప్పాలని ఎంపీడీవోను ప్రశ్నించారు. దీనిపై వెటర్నరీ వైద్యుడు శ్రవణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. లబ్ధిదారులను తాము ఎంపిక చేయలేదని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి వచ్చిన జాబితాను తాము అలాగే పంపడం జరిగిందన్నారు. పచ్చపార్టీ నేతలకే అన్ని అధికారాలు ఉంటే ప్రజాప్రతినిధులను తొలగించి మీరే పాలించుకోవాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమావేశాన్ని బహిష్కరించేందుకు ప్రయత్నించారు. జడ్పీటీసీ సభ్యుడు గాంధీ మాట్లాడుతూ.. ఏకపక్షంగా అధికారులు వ్యవహరిస్తే ఏ సమావేశము సక్రమంగా జరగదన్నారు. వారంలోపు బిల్లులు చెల్లిస్తానని, ఇకపై ఇలాంటి సమస్య రాకుండా చూసుకుంటానని ఎంపీడీవో హామీ ఇవ్వడంతో సమావేశం కొనసాగింది. సమావేశంలో వైస్ ఎంపీపీలు వెంకటలక్ష్మి, కన్నియప్ప, డీటీ మేఘవర్ణం, కోఆప్షన్ సభ్యులు దస్తగిరి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్కంధ షష్టి ఉత్సవాలు



చతుర్కర అలంకరణలో సుబ్రహ్మణ్య స్వామి

నగరి : పట్టణ పరిధి కరకంతేశ్వర స్వామి ఆలయంలోని సుబ్రహ్మణ్య స్వామి సన్నిధిలో స్కందషష్టి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామికి ఆలయ అర్చకులు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో చతుర్కర అలంకరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేసి పుష్పాలంకరణ చేపట్టారు. ధర్మకర్త సుబ్రహ్మణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గంజాయి నిర్మూలనకు సహకరించండి

నగరి : సైబర్ క్రైం, గంజాయి నిర్మూలనకు మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సహకారం అందించాలని సీఐ మహేశ్వర్ కోరారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు సెల్‌ఫోన్‌లు అవసరమైతే మినహా ఇవ్వరాదన్నారు. అలాగే గంజాయి చాపకింద నీరులా పాకుతోందని అందరూ సహకరిస్తే దానిని నిర్మూలించేందుకు వీలుంటుందన్నారు. ఓజీ కుప్పంపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. మిగిలిన ప్రాంతాల్లో ఎక్కడ గంజాయి విక్రయాలు కనిపించినా వెంటనే సమాచారం అందించాలన్నారు. పిల్లల నడవడికను తల్లిదండ్రులు గమనిస్తుండాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ మహేశ్వర్

మునిరత్నం ఎన్నికపై అభినందన

నగరి : ఉపాధ్యాయ సంఘం యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా నగరి పట్టణానికి చెందిన ఉపాధ్యాయులు మునిరత్నం ఎన్నికయ్యారు. చిత్తూరులో జరిగిన 17వ జిల్లా మహాసభల్లో ఆయనను రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎన్నుకున్నారు. మండల యూటీఎఫ్ కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి

నగరి : పట్టణ పరిధిలో నాగుల చవితి వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. శివాలయాలు, నాగదేవత ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఓంశక్తి ఆలయం సమీపంలోని నాగదేవత ఆలయంలో స్థానిక భక్తులు ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేశారు. బాలాజీ గోల్డెన్ సిటీలోని రాహుకేతు నాగాలమ్మ ఆలయంలో ఉదయం నుంచే మహిళల సందడి కనిపించింది. నాగదేవతకు సంప్రదాయం ప్రకారం పూజలు చేసి మర్రి చెట్టుకు రక్ష కట్టారు. పుట్టపై పసుపు, కుంకుమ చల్లి పాలు, గుడ్డు పోసి నైవేద్యం సమర్పించారు. పట్టణ పరిధిలోని కామాక్షి సమేత కరకంతేశ్వర ఆలయంలో స్వామికి, నాగదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. దేశమ్మ దేవాలయంలోని నాగదేవత ప్రతిమకు అభిషేకాలు చేశారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : నాగుల చవితి సందర్భంగా మండలంలోని బలిజకండ్రిగలో గంగమ్మతల్లి ఆలయంలోని నాగమ్మకు పూజలు చేశారు. అలాగే శ్రీబొమ్మరాజుపురం, పాలసముద్రం బీసీ కాలనీ, వనదుర్గాపురం గ్రామాల్లో పుట్టకు పూజలు చేసి, పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

నింద్రలో..

నింద్ర : నాగుల చవితిని పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో నాగమ్మకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రమైన నింద్రలో నాగుల పుట్ట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా అత్తూరు, అరూరు, అగరం గ్రామాల్లో నాగుల చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

పుత్తూరులో..

పుత్తూరు : స్థానిక రైల్వే క్వార్టర్స్‌లోని నాగాలమ్మ ఆలయంలో మంగళవారం నాగుల చవితిని మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం గణపతి హోమం, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలోని వరసిద్ధి వినాయకస్వామి, శ్రీమానసాదేవి, శ్రీసుబ్రమణ్యంస్వామి, రాహుకేతువులకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. నాగాలమ్మ పుట్టలో మహిళలు పాలు, కోడిగుడ్లు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు సూర్యనారాయణ పర్యవేక్షించారు.



పాలసముద్రం : వనదుర్గాపురం నాగాలమ్మకు పూజలు చేస్తున్న మహిళలు



పాలసముద్రం : అత్తిమాంజేరిపేటలో పూజలు



పుత్తూరు : అలంకరణలో నాగాలమ్మ







నగరి : ఓంశక్తి ఆలయం వద్ద గల నాగాలయంలో అన్నదానంలో భక్తులు, నాగాలమ్మ ఆలయంలో పూజలు, నింద్ర : అలంకరణలో నాగమ్మ